# 11న నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేద్దాం

**-బిజెపి జిల్లా అధికార ప్రతినిధి సుధీర్‌కుమార్**

**జహీరాబాద్, మే 7, ప్రభాతవార్త:**
ఈ నెల 11న జిల్లా సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ని జయప్రదం చేయాల్సిన అవసరం పార్టీ శ్రేణులపై, నిరుద్యోగులపై ఉందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చింతల్‌గట్టు సుధీర్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసి రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. 11న నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. గత శాసనసభ ఎన్నికల తరుణంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిరుద్యోగ భృతి 3వేల రూపాయలు ఇస్తానని చేసిన హామి నేటికి నెరవేరలేదని ఆరోపించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# నేడు సంకష్టహార చతుర్థి ఉత్సవం

**-ముస్తాబవుతున్న వరసిద్ధివినాయక ఆలయం**

**న్యాల్‌కల్, మే 7, ప్రభాతవార్త:** సంకష్టహార చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని హద్నూర్ గ్రామ శివారులోని స్వయంభూవు శ్రీవరసిద్ధి వినాయక ఆలయం ముస్తాబవుతోంది. ఈ నెల 8న ఆలయంలో సంకష్టహార చతుర్థి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటి బాధ్యులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి మామిడి తోరణాలతో, ఆలయ దారిలో రోడ్డుకు ఇరువైపుల కాషాయ జండాలను ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం పురుహితులు గణపతి దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం భజనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు(అన్నదానం) అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ బాధ్యులు వివరించారు. ఆలయానికి హద్నూర్ గ్రామస్థులతో పాటు మల్కన్‌పాడ్, రుక్మాపూర్, న్యామతాబాద్, గుంజోటి, రాంతీర్థం, న్యాల్‌కల్ గ్రామాల ప్రజలు స్వామి వారిని దర్శించుకుంటారని, భక్తుల దర్శనానికి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిటి బాధ్యులు వివరించారు.



రాంసాగర్‌లో పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

# పెద్దమ్మ తల్లి ఆశీర్వాదంతో వర్షాలు బాగా కురవాలి

**ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి**

**రాయపోల్, మే 7 ప్రభాతవార్త :** పెద్దమ్మతల్లి ఆశీర్వాదంతో ఈ యేడు వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అదివారం ఆయన రాయపోల్ మండల పరిధిలోని చిన్నమసాన్‌పల్లి, రాంసాగర్ గ్రామాలలో జరుగుతున్న పెద్దమ్మ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజుల సంక్షేమం కోసం సిఎం కేసిఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముదిరాజులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. గ్రామాలలో మండుటెండల్లో చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయంటే అది మన ముఖ్యమంత్రి కేసిఆర్ ఘనతేనని అని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, మండల బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు వెంకటేశ్వర శర్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, రైతు బంధు మండల అధ్యక్షులు మున్నా, చిన్నమసాన్‌పల్లి సర్పంచ్ బుచ్చమ్మ, రాంసాగర్ గ్రామ సర్పంచ్ కొండారి సంధ్యగణేష్, పెద్ద అరేపల్లి సర్పంచ్ కరుణాకర్, నాయకులు ఇప్ప దయాకర్, రేకుల లక్ష్మారెడ్డి, కల్లూరి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు వెంకట్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, మంతూరి యాదగిరిగౌడ్, మహేష్‌గౌడ్, క్రిష్ణా, అశోక్, పెయింటర్ రవి, రాంసాగర్ ముదిరాజ్ సంఘం నాయకులు, చిన్నమాసాన్‌పల్లి ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల ఇష్టారాజ్యం...!

**-ఎమ్మెల్యే పర్యవేక్షణలోపమే కారణం**

**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్**



రోగులతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్

**హుస్నాబాద్, మే7, ప్రభాతవార్త**
హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సమయ పాలన పాటించకుండా లక్షలకు లక్షల జీతాలు తీసుకుంటున్నారు. రోజు విధులు నిర్వహించాల్సిన వైద్యులందరూ ఏకమై వంతుల వారిగా తమ విధులను నిర్వహిస్తూ రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం ఆసుపత్రికి వచ్చిన రోగులను చూసేందుకు కనీసం ఒక్క డాక్టర్ కూడా రాలేదని విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆసుపత్రికి వెళ్ళి సిబ్బందిని నిలదీశారు. కాలికి దెబ్బలు తగిలి వచ్చిన ఓ వ్యక్తికి కనీసం ప్రాథమిక చేసుకుందుకు ఎవరూ లేకపోవడంతో అతను అక్కడే గంటల తరబడి నిరీక్షిస్తునాన్నడని వాపోయారు. రోజు విధులు నిర్వహించాల్సిన వైద్యులు ఏకమై వంతుల వారిగా విధులు నిర్వర్తించడమేంటని మండి పడ్డారు. ఆసుపత్రిలో నిర్వహించే రక్తపరీక్షల రిపోర్టులు సైతం అదేరోజు ఇవ్వకుండా మరుసటి రోజు ఇస్తుండడంతో ఆ రిపోర్టుల ఆదారంగా మందు బిల్లలు ఇస్తుండడంతో ఇంతో మందికి సైడ్ ఎఫెక్టులు వస్తున్నాయన్నారు. ఆసుపత్రిలో వైద్యులు ఇష్టాను సారంగా వ్యవహరించేందుకు కారణం స్థానిక ఎమ్మెల్యేకు ఆసుపత్రిలో పర్యవేక్షణ చేయకపోవడంతోనే సూపరిండెంట్, వైద్య సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు మాటలు ఉట్టి మాటలేనని ఈ ఆసుపత్రిలో తీరును చూస్తే అర్థమౌతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలని లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# మానసిక, శారీరక వికాసానికి యోగ విద్య అద్భుతం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రజల మానసిక. శారీరక, అర్థిక వికాసానికి యోగ విద్య అద్భుతంగా పని చేస్తుందని రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన యోగ జడ్జెస్ సర్టిఫికెట్ల పంపిణీ అదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధియే లక్ష్యంగా సిఎం కెసిఅర్ అద్భుత పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. భావి అరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్రంలోని 26 వైద్య కళాశాలలో విద్యార్థులకు యోగ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని విద్యా సంస్థల్లో యోగ విద్యను ప్రవేశపెడుతామన్నారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు తెచ్చిన ప్రజల భాగస్వామ్యం ఉంటేనే వంద శాతం ఫలాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ అరోగ్యం కోసం అరగంట యోగాసనాలు చేయాలన్నారు. యోగ శిక్షకులు, న్యాయ మూర్తులు, సంస్థలు, అరోగ్య తెలంగాణ సాధనలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టి.యోగసాన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృపాకర్, టెక్నికల్ కార్యదర్శి తోట సతీష్, కె .అంజయ్య, తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి పాల్గొన్న యోగ న్యాయమూర్తులకు, జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన వారికి మంత్రి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి హరీష్‌రావు

# అంజన్న అందరిని చల్లంగ చూడాలి

**మంత్రి తన్నీరు హరీష్‌రావు**



హనుమాన్ దీక్ష పరులకు భిక్ష వడ్డిస్తున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అంత రామ మయం..జగమంత రామ మయం.. అన్నట్లుగా రామ నామం..హనుమాన్ స్మరణతో సిద్దిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అదివారం మార్మోగింది. మంత్రి తన్నీరు హరీష్‌రావు అధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో హనుమాన్ మాలధారణ స్వాములకు బిక్షా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2 వేల మంది స్వాములు బిక్షను స్వీకరించారు. ఉదయం అర్చకులు చిలకమర్రి వెంకట రమణాచార్యులు అధ్వర్యంలో అంజనేయ స్వామికి పంచామృత అభిషేకం అర్చన, హనుమాన్ స్వాములచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం హనుమాన్ స్మరణ రామ నామంతో అట్టహాసంగా హనుమాన్ స్వాములకు బిక్ష కార్యక్రమం నిర్వహించారు. మంత్రి హరీష్‌రావు స్వయంగా స్వాములకు బిక్షను వడ్డించారు. అనంతరం హనుమాన్ స్వాములందరి అశీర్వదాం తీసుకొని తాంబూలాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంజన్న అందరిని చల్లగా చూడాలని ఈ ప్రాంతం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. క్యాంపు కార్యాలయం అధ్యాత్మిక, భవవన్నామ స్మరణతో హనుమాన్ స్వాములతో ఉట్టిపడింది. కార్యక్రమంలో హనుమాన్ మాలధారణ భక్తులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, కొండం సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేణుకా ఎల్లమ్మ జమదగ్ని..**
**సిద్ధోగంలో మంత్రి ప్రత్యేక పూజలు**

సిద్దిపేట రూరల్ మండల పరిధిలోన ఇరుకోడులో శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల సిద్ధోగం కల్యాణోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో మంత్రి హరీష్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు శుభ కార్యాలలో మంత్రి పాల్గొన్నారు. అలాగే తొర్నాల గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఉత్సవ వేడుకల్లో మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. పోచమ్మ దేవాలయంలో అయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

**పోలీస్ స్టేషన్ వద్ద ఒక వర్గం ఆందోళన**

**నర్సాపూర్, మే 7.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలో ఇరువర్గాల మధ్యన ఘర్షణ చోటు చేసుకుంది. నర్సాపూర్ పట్టణంలో హనుమాన్ మాల వేసుకున్న గ్యాస్ డెలివరి బాయ్ లింగం ను మరొక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దాడి చేశాడు. దీంతో ఇరువురు ఘర్షణ పడగా బాధితుడు లింగం పోలీస్ స్టేషన్ లో పిర్యాధు చేశారు. దీంతో హనుమాన్ మాల వేసుకున్న వ్యక్తిపై దాడి చేశాడన్న విషయాన్ని తెలుసుకున్న హనుమాన్ దీక్షా స్వాములు, ఆర్ఎస్ఎస్ కార్యక్తలు, బిజెపి నాయకులు, హిందువాహిణి కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరిలివచ్చి పోలీస్ స్టేషన్ ముందు భైఠాయించి ఆందోళన, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ ఆందోళన చేయడంతో వాతావరణం ఉద్రిక్తతకు దారి తీసింది, మాల వేసుకున్న వ్యక్తి పై దాడి చేసిన వ్యక్తి ని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అప్పటి వరకు తాము ఇక్కడి నుండి కదిలేదని తేల్చి చెప్పారు. దాడి చేసిన సదరు వ్యక్తి స్టేషన్ కు తీసుకువస్తుండగా ఆందోళన కారులు పోలీస్ వాహనాన్ని చుట్టుముట్టారు, దీంతో అక్కడి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ మేరకు దాడి చేసిన వ్యక్తి పోలీసులు అరెస్ట్ చేయడంతో కొంతమేర సద్దుమనిగింది. ఈ నిరపన కార్యక్రమంలో బిజెపి నాయకులు మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బిజెపి కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాజెందర్, అర్ఎస్ఎస్ జిల్లా కార్యావాహ ఓంకార్, హనుమాన్ దీక్షా స్వాములు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న బిజెపి నాయకులు




దాడి చేసిన వ్యక్తి తీసుకురాగా పోలీస్ వాహనంపై దూసుకువెళ్తున్న ఆందోళనకారులు

# షావుకారు మాయాజాలం

**బత్తకు కిలో కాకుండా బాటుకు కూడా కిలో వసూలు చేసిన షావుకారు**
**రైతును నిలువుదోపిడీ చేస్తున్న వైనం**
**-షావుకారు అవినీతి బాటును స్వాధీనం చేసుకున్న పంచాయతీ**

**అక్కన్నపేట, మే7, ప్రభాతవార్త**
మట్టికి కిలో సంచికి కిలో అంటూ ఇదే కాకుండా తేమ తోటకూర కట్ట అంటూ వివిధ వేషాలు వేసి దోచుకుతింటున్న షావుకార్లు మరో నూతన ఎత్తుగడతో అడుగు ముందుకు వేసి రైతన్నను ఎలా ఎంతగా దోచుకోవాలోనని షావుకారు తన బుర్రకు పదును పెట్టి బాటునే మాయాజాలంతో రైతన్నల ముందుకు వచ్చి పంటధాన్యం గింజలను దోచుకుతింటున్న సంఘటన అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లి గ్రామంలో రైతాంగం నుండి ప్రయివేట్‌గా దాన్యం సేకరస్తున్నాడు. వివరాల్లోకి వెళితే కుందనవానిపల్లి గ్రామానికి చెందిన మాజీ బిఆర్ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షులు బత్తుల సంపత్ అనే షావుకారు ఈ తతంగానికి ఒడిగట్టాడు. షావుకారు మాయాజాలాన్ని గుర్తించిన రైతాంగం బాటును పసిగట్టి పంచాయితీ సర్పంచ్‌కు తెలుపడంతో తక్షణము బాటును స్వాధీనం చేసుకుని పంచాయితీ కార్యాలయంలో బాటును ఉంచారు. ఈ మేరకు దోపిడీకి గురైన రైతాంగం తమ పంటనష్టానికి సంబంధించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. షావుకారు దోపిడీ తతంగం ఇలా సాగింది. కుందనవానిపల్లి గ్రామంలో షావుకారు రైతుల నుండి ధాన్యం సేకరించే క్రమంలో మక్కల కొనుగోలు చేసే షావుకారు తన బాటుకు కిలో అధికంగా బరువు వచ్చేలా చేయించుకుని తూకం చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేస్తూ సంచికి కిలో బరువను మక్కలకు తీస్తూనే అటు బాటుకు సైతం అధికంగా బరువు అదనంగా తీసుకుంటున్నాడు. ఇలా మక్కల కొనుగోలులో మొత్తం రెండు నుండి మూడు కిలోల వరకు మక్కల ధాన్యంను సేకరించి దాదాపు 60ట్రాక్టర్ల లోడ్‌ను ఎగుమతి చేసినట్లు రైతాంగం చెపుతోంది. కుందనవానిపల్లి గ్రామ పరిసరాల ప్రాంతంలోని పరిదిలోని గండిపల్లి, మైసమ్మవాగుతండ, గొల్లపల్లి, చెరువు ముందుతండ, కేశనాయక్‌తండ, పంచరాయితండ గిరిజన పేద రైతాంగం నుండి ఈ ధాన్యం సేకరించిన షావుకారు ఈ ధాన్యాన్ని తరలించే క్రమంలో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీరాఘవేంద్రవేబ్రిడ్జినందు తూక వేయిస్తున్న క్రమంలో కొందరు రైతులు ఈ తూకంను గమనించి రైతాంగానికి సమాచారం అందించడంతో ఈ షావుకారు దోపడి తతంగం వెలుగులోకి వచ్చింది. దీంతో సర్పంచ్‌కు సమాచారం ఇవ్వడంతో అతను బాటును స్వాధీనం చేసుకుని పంచాయితీలో పెట్టించారు.

ఈ విషయంపై గిరిజన రైతాంగం ఆందోళనకు గురవుతూ తాము అన్యాయమైపోయామని షావుకారు నుండి తమకు న్యాయం జరిగేలా చేయాలన సర్పంచ్‌ను వేడకుంటున్నారు.

# దేశానికి ప్రమాదకరంగా మారిన బిజెపి, ఎంఐఎం మతరాజకీయాలు

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహా**

**నర్సాపూర్, మే 7, ప్రభాతవార్త:** బిజెపి హటావో దేశ్‌కి బచావో ఇంటింటికి సిపిఐ పాదయాత్ర అనే కార్యక్రమంలో బాగంగా ఆదివారం నర్సాపూర్‌లో పట్టణంలో దుకాణాల సముదాయాలలో తిరుగుతూ కరపత్రాలను పంచి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్ తో పాటు సిపిఐ నాయకులు పాల్గొని ప్రచారం చేశారు. ఈసందర్బంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ మాట్లాడుతూఅభివృద్ధి నిరోదక బిజెపి ఎంఐఎం మత రాజకీయాలు చేస్తు దేశాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయని అన్నారు. ఈ మత రాజకీయ పార్టీలను ప్రజలు ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికంగా దరలను పెంచడం, నిరుద్యోగం, పేదరికం, రైతు ఆత్మహత్యలు కనీస వేతనాలు అందుకోలేని కార్మికులు వంటి సమస్యలు పట్టించుకోకుండా మత రాజకీయాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. మెదక్ జిల్లాలో కొన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తు మరికొన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం లేదన్నారు. భూముల క్రమబద్ధికరణఅంటు ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి రైతులకు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అకాల వర్షాలకు పంటలు పాడయ్యి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పటి రవకు ఇవ్వడం లేదన్నారు. వెంటనే పంటల్లో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతన్న ప్రజా వ్యతిరేక విదానాలను ప్రజలకు తెలియజేసి చైతన్యం కలిస్తున్నట్లు తెలిపారు. మత రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ప్రజలు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చేపాలని తదితర విషయాలను ఇంటింటికి సిపిఐ పాదయాత్ర కార్యక్రమంలో తెలియజేశామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహా, సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జయరాజు, నాయకులు కిషన్, అక్బర్, పట్నం కిష్టయ్య పాల్గొన్నారు.



ఇంటింటికి సిపిఐ పాదయాత్ర అనే కార్యక్రమంలో పాల్గొన్న ఈటి నరసింహా, సిపిఐ జిల్లా కార్యదర్శి టిఎం కాలేక్



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న డిసిసి అధ్యక్షులు తిరుపతిరెడ్డి

# మొద్దు నిద్రలో ప్రభుత్వం.. రైతుల పరిస్థితి దయనీయం

**డిసిసి అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి**

**పాపన్నపేట, మే 7, ప్రభాతవార్త:** తడిసిన, మొలకెత్తిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని డిసిసి అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేటలో అకాలంగా కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను, వరి కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సంద్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పంట నష్టన్ని పరిశీలించి ఎకారినికి 25 వేల రూపాయల చొప్పున రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వరి కొనుగోలు ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు అకాల వర్షాలకు పంటలను నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వరి పంటను 15వేలకు పైబడి ఎకారాల్లో రైతులు పంటను పండించారని, అకాల వర్షాలతో 50శాతంకు పైగా దెబ్బతిందని విచారం వ్యక్తం చేశారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ధరణి లోపాల మూలంగా పాస్‌బుక్‌లలో నమోదు కాని రైతుల పంట పొలాలను రెవిన్యూ అధికారులచే సర్టిఫై చేయించి వారి ఖాతాల్లోనే పంట నష్టపరిహారం క్రెడిట్ అయ్యేలా చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్ అదికారులను సమన్వయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, రమేష్ గౌడ్, శంరెడ్డి, యాదగిరి, అనిల్, విటలక్షప్ప, ప్రేమ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తిగా లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటానికి సిద్ధం కావాలి

**సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్**



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

**మెదక్ మున్సిపాలిటీ, మే8 ప్రభాతవార్త:**
మే డే స్ఫూర్తిగా లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన మే డే ముగింపు సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పాత బస్టాండ్ నుండి పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు నష్టం చేసే విధానాలను తీసుకువచ్చి కార్మికుల నడ్డి విరుస్తుందన్నారు. మే డే అంటే పని గంటలు, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప విప్లవ పోరాటమని గుర్తు చేశారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకునన అనేక కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మలుస్తున్నారని అన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు అప్పగిస్తూ చీకటి దారుల్లో వారతో దోస్తీ చేస్తున్నారన్నారు. మే డే స్ఫూర్తిగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నూతనంగా తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం మల్లేశం, సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, నాయకులు ఏసు, బద్రి, అంజమ్మ, ప్రేమిల, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కెటిఆర్, హరీష్‌రావుల మాటలు అహంకారపూరితం

**-బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్**

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):**
రాష్ట్ర మంత్రులు కెటిఆర్, హరీష్‌రావులు అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారని బిజెపి సిద్దిపేట జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్ విమర్శించారు. ఆదివారం స్థానిక ప్రజ్ఞా గార్డెన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్దాలతో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజానీకాన్ని మోసం చేసిన కెసిఆర్‌ను గద్దె దించేదాకా నిద్రపోయేది లేదని స్పష్టం చేశారు. గజ్వేల్ రూపురేఖలు మారుస్తానన్న కెసిఆర్ మాట తప్పి జనాలను మోసం చేశాడని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా బలంతో గజ్వేల్‌లో బిజెపి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటి సెల్ కన్వీనర్ వెంకటరమణ, మెదక్ పార్లమెంట్ బిజెపి కన్వీనర్ రాంమోహన్‌గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు ఎల్లు రాంరెడ్డి, గురువారెడ్డి, కప్పర ప్రసాద్‌రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ల శ్రీనివాస్, నలగామ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కో-కన్వీనర్లు సురేష్, మహేష్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు పంజాల అశోక్, శశిధర్‌రెడ్డి, పల్లె రమేష్‌యాదవ్, నత్తి శివకుమార్, పెండ్యాల శ్రీనివాస్, మన్నె శేఖర్, ఏగొండ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందన్‌గౌడ్

## పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : శ్రీగణేష్



రెజిమెంటల్ బజార్‌లో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నేత శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట, మే 7 ప్రభాతవార్త: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఎస్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శ్రీగణేష్ పౌండేషన్, కేర్ ఆసుపత్రి ముషీరాబాద్, అగర్వాల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రెజిమెంటల్ బజార్‌లో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ వైద్య పరిక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. అదే విధంగా కంటి పరిక్షలు చేయించుకున్న వారికికంటి అద్దాలు, అపరేషన్లు కూడా ఉచితంగా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సన్నీపాల్, సాయి, రజీనా, మార్ ్య, శ్రీకాంత్, రోడీ జాన్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా: క్రిషాంక్



లోహియ నగర్ బస్తీ నిద్రలో ప్రసంగిస్తున్న మన్నె క్రిషాంక్

కంటోన్మెంట్, మే 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసేస్తానని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ మన్నె క్రిషాంక్ తెలిపారు. శనివారం రాత్రి మోండా డివిజన్‌లోని లోహియ నగర్‌లో నిర్వహించిన 7వ బస్తీ నిద్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ లోహియ నగర్‌లో రోడ్లు,డ్రైనేజీ, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు అంగన్ వాడి కేంద్రం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామన్నారు. బస్తీలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన స్పందించిన తన సొంత నిధులతో ఆదివారం బోర్‌వెల్‌ను వేయించారు. అదే విధంగా పంపుసెట్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు ధ్యానీ, శ్యామ్, మోనీ, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలి

**కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షులు సదాకేశవరెడ్డి**



ఖర్ఖానా ముత్యాలమ్మ ఆలయం వేడుకలకు హాజరైన సదాకేశవరెడ్డిని సత్కరించిన అభిమానులు

బేగంపేట మే 7, ప్రభాతవార్త : ఖర్ఖానా ముత్యాలమ్మ అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపైన ఉండాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదాకేశవరెడ్డి అన్నారు. ఆదివారం అమ్మ వారి ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలలో సదా కేశవరెడ్డి పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా సదాకేశవరెడ్డి మాట్లాడుతూ ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలతో పాటు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజు, తరుణ్, శేషు, మణి,సంతు, అశోక్‌గౌడ్, పాండు భక్తులు పాల్గొన్నారు.

## హిందు ధర్మ పరిరక్షణ కొరకు కృషి



తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులుగా నియమితులైన ఎన్.ఆర్.లక్ష్మన్‌రావు గుప్తకు సన్మానం

గోషామహల్,మే7ప్రభాతవార్త: హిందు ధర్మ పరిరక్షణ కొరకు తన వంతు కృషి చేస్తాననితెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులుగా నియమితులై భాద్యతలు స్వీకరించిన ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త అన్నారు.ఆదివారం గో సేవా ఆధ్వర్యంలో లక్ష్మన్‌రావుగుప్త హన్‌మాన్ మందిరం,శ్యామ్‌బాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్బంగా లక్ష్మన్‌రావు గుప్తను శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రంజనీ శ్రీరామోజ్, ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, సిటి ఉపాధ్యక్షులు నందకిషోర్ అగర్వాల్, సునీల్ అగర్వాల్, కిరణ్, సంగం,రాజారాం,దీరజ్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువ సంఘర్షణ
## సభను విజయవంతం చేయాలి

చార్మినార్, మే 7 ప్రభాతవార్త : సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన జరగనున్న నిరుద్యోగ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సభలో నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించనున్నారని ఆయన తెలిపారు.టిపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరగనున్న నిరుదో ్యగ నిరసన సభకు పాతబస్తీలోని అన్ని ప్రాంతాలు నుంచి నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

### మానవసేవే మాధవ సేవగా భావించి
## వృద్ధులకు సేవలు అందించాలి



నిరుపేద వృద్ద మహిళలకు చీరెలు పంపిణి చేస్తున్న డి.ప్రసన్న

సైఫాబాద్, మే 7 ప్రభాతవార్త: మానవ సేవే మాధవ సేవగా భావించి నిరుపేద వృద్ద మహిళల అభ్యున్నతికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకారం అందించా లని కార్ఖానా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.ప్రసన్న విజ్ఞప్తి చేశారు. సేవ చేయడం అనేది ఒక అవకాశమని, ఈ భాగ్యం అందరికి లభించదని వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మన:శాంతిని, తృప్తిని పొందాలని కోరారు. అంతర్జాతీయ మదర్స్ డేని పురస్కరిచుకుని శ్రీకర సత్య సహకార సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ నిరుపేద వృద్ద మహిళలకు ఉచితంగా చీరెలు పంపిణి చేసిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. మానవ జీవితంలో వృద్దాప్యం చివరి అంకమని ఆదశలో ఉన్న వృద్దులైన తల్లిదండ్రులను పిల్లలు ప్రేమ, అప్యాయతలతో చూసుకోవాలని వారి సమస్యలను అవగాహన చేసుకుని పరిష్కారించాలని ఆమె సూచించారు. మహిళల జీవితం ఎంతో గోప్పదని, ఆదర్శవంతమైనదని, మహిళలు లేనిదే సమాజమే లేదన్నారు. నేటి మహిళలు విద్యావంతులుగా ఎదగి తమ కాళ్లపైన నిలబడి జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్ని రంగాలలో పురుషులతోపాటు రాణిస్తున్నారని ఆమె గుర్తు చేశారు. జన్మనిచ్చిన తల్లిని ఎవరు మరువరాదని తల్లికి సేవ అందించడం ఒక అదృష్టంగా భావించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్, ఎస్‌పిఐ నరేష్‌బాబు పాల్గొన్నారు.

## పిల్లలకు విలువలతో కూడిన నాణ్యతమైన విద్యను అందించాలి

అడ్డగుట్ట, మే 7 ప్రభాతవార్త: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు టీచర్లు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీపల్‌ట్రీ ఫ్రీ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. నర్సరీ, ప్రే స్కూల్‌లో చేర్పించే పిల్లలకు విలువలతో కూడిన నాణ్యతమైన విద్యను అందిస్తే చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తితో వారు విద్యాపరంగా అభివృద్ధి చెంది బావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు చిర్రబోయిన మల్లేశ్ యాదవ్, సంతోష్ యాదవ్, శ్రావణ్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లు బత్తుల నారాయణ, దేవులపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఠాకూర్ అమర్‌సింగ్**



లబ్ధిదారునికి చెక్కును అందజేస్తున్న ఠాకూర్ అమర్‌సింగ్

మెహిదీపట్నం, మే 7, ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని బిజెపి కార్వాన్ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్వాన్ సబ్జిమండికి చెందిన తన్వీర్ అహ్మద్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార మంజూరైన రూ.30 వేల చెక్కును ఆదివారం గుడిమల్కాపూర్‌లోని పార్టీ కార్యాలయం లో అందజేశారు. ఈ సందర్భంగా ఠాకూర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుం దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల గోవర్ధన్, గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డిజ్వర్‌సింగ్, మైనార్టీ మోర్చ నాయకులు అహ్మాద్‌లు పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించడం మంచి సంప్రదాయం



పురస్కారాలు ప్రదానం చేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, మే 7 ప్రభా తవార్త: గోల్డెన్‌స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం, జనకల వేములవాడ సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, ఒగ్గుకథలు, క్లాసికల్ డ్యాన్సులు, సోషల్ సర్వీస్ రంగాలలో విశేషంగా ప్రతిభ కనబర్చి నందుకుగాను ప్రశం సా పత్రాలు అందించే కార్యక్రమ నిర్వాహక సంస్థ అధినేత, జానపద బ్రహ్మ, జానపద రత్న డాక్టర్ జవ్వాజి అంజయ్య ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా బింగి నరేందర్‌గౌడ్, మల్కాజిగిరి కోర్టు పూర్వ జడ్జ్ బూర్గుల మధుసూదన్, సెంట్రల్ జోన్ అసెంబ్లీ ఏసీపీ రామ్‌దాస్ తేజావత్, నర్సయ్య, ఫిలిం డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు, ప్రైం టీవీసీఈఓ శ్రీనివాస్, భక్తి టీవీ సీఈఓ శ్రీనివాస్, జగిత్యాల ఎస్ఐ పిల్లి రామచంద్రంగౌడ్, కెవి.భక్తవత్సల తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలకు కెసిఆర్ సమన్యాయం

**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు

సైఫాబాద్, మే 7 ప్రభాతవార్త: తెలం గాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ రాజ్యాంగం ప్రకారం పాలన కొనసాగిస్తు న్నారని, అన్ని వర్గాల ప్రజలకు న మ న్యా య ం అంది స్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వం క్రైస్తవుల కోసం, క్రైస్తవ సమాజం కోసం మెరుగైన జీవనాన్ని అందించడానికి కృషి చేస్తున్నదని తెలిపారు. ఆదివారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన వర్‌షిప్ కాన్ఫెరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కెసిఆర్ ఉన్నంతవరకు క్రైస్తవులు భయపడవలసిన అవసరం లేదని, వారు స్వేచ్ఛగా జీవించవచ్చునని మంత్రి చెప్పారు. ప్రస్తుతం దేశంలో పరిస్థిలు బాగోలేదని, అన్ని వర్గాల వారు సమానంగా జీవించవలసి ఉందని కాని పరిస్థిలు ఆ విధంగా లేవని విచారం వ్యక్తం చేశారు. యేసుక్రిస్తు ప్రేమ, కరుణ, సేవా, ఆనందంతో జీవించమని మార్గం చూపించారని, క్రిస్తు మార్గంను సమాజం అచరించాలని సూచించారు. క్రిస్టియన్ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ అన్ని మతాలను, అన్ని వర్గాలను గౌరవిస్తున్నారని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్ర సచివాలయంలో చర్చి లేదని, కాని తెలంగాణ రాష్ట్రంలోని సచివాలయంలో కెసిఆర్ అనుమతితో చర్చి నిర్మాణం కొనసాగుతున్నదన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ ప్రముఖ గాయకులు పెద్దఎత్తున ప్రార్ధనలు నిర్వహించి భక్తిగీతాలను అలపించారు.

## బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణ కార్యక్రమం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, హవనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం ఈ ఉత్సవాల్లో భాగంగా భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణం వంటి కార్యక్రమాలు పూర్తయిన అనంతరం 'శేషవాహనసేవ' జరిగింది. కాగా ఆదివారం పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఉత్సాహంగా పాలపిట్ట సైక్లింగ్ రైడ్



జెండా ఊపి సైకిల్ రైడ్‌ను ప్రారంభిస్తున్న ఒంటేరు ప్రతాపరెడ్డి

గచ్చిబౌలి, మే 7 ప్రభాతవార్త : కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైటెక్‌సిటీ నడిబొడ్డున దట్టమైన అడవిని తలపిస్తున్న బొటానికల్ గార్డెన్ సైక్లింగ్ పార్కులో సైకిల్ రైడ్ చేసిన ఔత్సాహికులు వింత అనుభూతిని పొందారు. తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టిఎస్ఎఫ్‌డిసి), హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్(హెచ్‌బిసి), వరల్డ్ సైక్లింగ్ అలయన్స్‌ల ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని పాలపిట్ట సైక్లింగ్ పార్కులో నిర్వహించిన పాలపిట్ట సైక్లింగ్ రైడ్, నైట్ సఫారీ పార్కు సైకిల్ రైడ్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ సైకిల్ రైడ్‌లో వేలాది మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి టిఎస్ఎఫ్‌డిసి చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి, ఎండి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్ గారెన్ విన్ ఓవెన్‌లు ముఖ్యఅతిధులుగా హాజరై జెండా ఊపి సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సైకిల్ రైడ్ పాలపిట్ట సైక్లింగ్ పార్కుతో పాటు ఇంకా ప్రారంభించని నైట్ సఫారీ పార్కుల మీదుగా కొనసాగిందని తెలిపారు. ఈ సైక్లింగ్ పార్కులో సైకిల్ రైడ్ చేసే వారు దట్టమైన అడవిలో సైకిల్ తొక్కిన అనుభూతిని పొందుతారన్నారు. 37 ఎకరాల్లో విస్తరించిన ఆటవీ భూమిలో పచ్చని చెట్లు, చెరువు కట్ట మీదుగా నెమళ్లు, బాతుల సంచారంతో సైకిల్ రైడ్ చేసే వారికి వింత అనుభూతి కలుగుతుందన్నారు. పాలపిట్ట సైక్లింగ్ పార్కులో హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో ఉన్న సైక్లింగ్ పార్కును పునరుద్దరించిందని తెలిపారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చిన పనులను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ సైక్లింగ్ అలయన్స్ మొదటి ఉపాధ్యక్షుడు డి.వి.మనోహార్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షుడు టి.సత్యానారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డు కార్మికులకు వేతనాల పెంపు ప్రక్రియను వేగవంతం చేయాలి

**హెచ్ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ**



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న హెచ్ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: హైదరాబాద్ మెట్రోవాటర్‌బోర్డులో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే జీవో 14, 60 అమలు చేయాలని హెచ్ఎండబ్లుఎస్ఎస్‌పి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవోల ద్వారా వేతనాలు అమలు చేయాలని కోరుతూ రూపొందదించిని గోడపత్రికను ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బిఆర్‌టియు రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయ కుమార్, మారుతి ప్రసాద్, వీరేశం, రమేశ్ తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, జిహెచ్ఎంసి కార్మికులకు జీవోల ద్వారా వేతనాలు పొందుతున్నారని, కాని వాటర్‌బోర్డులో పని చేసే కార్మికులకు మాత్రం జీవో 11 ద్వారా తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల పెంపు ప్రక్రియ పూర్తి అయిన సందర్భంలో వెంటనే వేతనాలు పెంచాలని బోర్డు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కాని వేతనాలు పెంపు ఆలస్యం కావడం వల్ల కార్మికులంతా ఆందోళన చెందుతున్నారన్నారు. కార్మిక పక్షపాతి అయిన సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లపై కార్మికులంతా నమ్మకంతో ఉండాలని కోరారు.

## కళల పుట్టినిల్లు భారతదేశం.. కళల కాణాచి తెలంగాణ

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**



సభలో ప్రసంగిస్తున్న ఆర్.కృష్ణయ్య, దైవజ్ఞశర్మ గుజ్జసత్యం, వీరేష్‌యాదవ్, ఏకవీర తదితర అతిథులు

నాంపల్లి, మే 7 ప్రభాతవార్త : కళలకు పుట్టినిల్లు అయిన భారతదేశం అతి ప్రాచీనకాలం నుండి 64 కళలు విరసిల్లుతూ కళాపరిమళాలను వెదజల్లుతూ ప్రపంచవ్యాప్తంగా కళల పుట్టినిల్లు, కళానిలయం, కళల ఆలయంగా పేరొందగా తెలంగాణ రాష్ట్ర కళల కాణాచిగా విరాజిల్లుతుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. అయితే గత కొంతకాలంగా పాశ్చాత్య పోకడలు ఎక్కువై కళలపట్ల యువతకు ఆసక్తి తగ్గుతుండడం శోచనీయమని, కళలను, కళాకారులను అన్నివిధాలా కాపాడవలసిన, ఆదుకోవాల్సిన, ప్రోత్స హించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రైవేట్ స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలపైన కూడా ఉందని ఆయన స్పష్టం చేశారు. డా. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కళలను ఎంతగానో ప్రోత్సహించారని, తెలుగుభాషా, కళల అభ్యున్నతికి ఏకంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్నే నెలకొల్పారని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య గుర్తుచేశారు. నృత్యమాల నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళా మందిరంలో జాతీయస్థాయి సంగీత నృత్య వేడుకలు సంస్థ డైరెక్టర్, ఆర్గనైజర్ ఎం.వీరేష్ యాదవ్, డా. ఎం.ఏకవీరల సారధ్యంలో వైభవోపేతంగా జరిగిన కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, విశిష్ట అతిథులు బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జసత్యం, దైవజ్ఞశర్మ, నాట్యగురువు రాధేశ్యామ్, వెంకట్‌యాదవ్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి ఈ సంగీత నృత్యవేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. సంగీత నాట్యకళలలో యోగా ఇమిడి ఉందని, పిల్లలలో మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని చేకూర్చడమే కాకుండా మేధస్సు, జ్ఞాపకశక్తి, శారీరక, మానసిక ఆరోగ్యం పెరిగి చైతన్యవంతులై విద్యతోపాటు అన్నిరంగాల్లో అద్భుతంగా రాణించి అత్యున్నత స్థాయిలకు చేరుకుంటారని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్ననాటి నుండే పిల్లలను కళలవైపు మరల్చి ఆసక్తి, అనురక్తి పెంచాలని కృష్ణయ్య సూచించారు. నేటి సంగీత నృత్యప్రదర్శనల్లో పాల్గొ న్న కళాకారులను ఆర్.కృష్ణయ్య అతిథుల చేతులమీదుగా ఘనంగా సన్మానించారు.

### గాయనీ సత్యదీప్తికి 'సుస్వర గాన మాధురి' బిరుదు

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: మధురమైన హిందీ తెలుగు పాటలను ప్రతిభావంతులైన గాయనీ గాయకులు ఆలపించి శ్రోతలను రంజింపచేశారు. ప్రముఖ సంగీత సంస్థ సుబ్బు మ్యూజిక్ అకాడమి అధినేత శ్రీధరం రామసుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు శ్రీధరం హైమావతి రాఘవయ్య జ్ఞాపకార్థం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రామసుబ్రహ్మణ్యం, సత్యదీప్తితో కలిసి తమిళం, తెలుగు, హిందీ పాటలను ఎంఎస్ఎన్.రావు, కె.శ్రీనివాసరావు, బంధవి, శ్రీకుమార్ నాయర్, స్వప్న, అపర్ణ, రాణిరావు, ఉదయ్ భాస్కర్, శ్రీనివాసన్, కామేశ్వర రావు, కెఇ.రాజు, జెసి.శ్రీనివాస్‌రెడ్డి, రవిబాబు, హారీష్ శర్మ, రామ్ హారీష్, గానం చేశారు. ఈ సందర్బంగా సత్యదీప్తికి 'సుస్వర గానమాధురి' బిరుదును ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ టివి.రావు దంపతులు, అర్చన వేంకటేశ్వరరావు దంపతులు, వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు ప్రదానం చేసి అభినందించారు.

## గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌యాదవ్



శ్రీనివాస్‌యాదవ్ నియమాక పత్రం అందచేస్తున్న గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్)

బేగంబజార్, మే 7 ప్రభాతవార్త: గోషామహాల్ నియోజకవర్గం బిఆర్ఎస్ బిసిసెల్ అధ్యక్షులుగా శ్రీనివాస్‌యాదవ్ నియ మి తు ల య్యా ర ు. బిఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయనకు నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్ (బిలాల్)చేతుల మీదుగా నియమాకపత్రం అందచేశారు. తనపై నమ్మకంతో ఈపదవి అప్పగించిన నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌కు,మంత్రులు కెటిఆర్,శ్రీనివాస్‌యాదవ్,మహామ్మద్‌అలీ, గ్రేటర్ అధ్యక్షులు మాగంటి గోపినాథ్ శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజావ్యాస్,బిఆర్ఎస్ నాయకులుశైలెందర్‌కురమ, పప్పు,శంకర్,అనిత తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో పెరుగుతున్న తలసీమియా రోగుల సంఖ్య

### నేడు ప్రపంచ తలసీమియా దినోత్సవం

చార్మినార్, మే 7 ప్రభాతవార్త : దేశంలో తలసీమియా వ్యాధిగ్రస్థుల సంఖ్య రోజు,రోజుకు పెరిగి పోతున్నారు..ఒక సారి తలసీమియా వ్యాధి బారిన పడిన రోగులు బ్రతికున్నంత కాలం తప్పని సరిగా డాక్టర్ సలహా మేరకు మందులు వాడవలసి ఉంటుంది.తలసీమియా వ్యాధి రక్తానికి సంబంధించిన ఆవలక్షణం.తలసీమియా వల్ల ఎర్ర రక్త కణాల జీవిత కాలం తగ్గి పోతుంది.పుట్టిన 6 నెలలు నుంచి 18 నెలలలోపు చిన్నారులకు రక్తహీనత,పెరుగుదల బాగలేక పోవటం,కాలేయం ప్లీహం వ్యాకోచించడం వంటి తలసీమియా వ్యాధి ప్రధాన లక్షణాలు తలసీమియా వ్యాధి బారిన పడిన చిన్నారులకు తగిన వైద్య చికిత్సలు సకాలంలో అందక పోతే కొద్ది సంవత్సరాలు తర్వాత మరణిస్తారు. తరచుగా రక్తం ఎక్కించటం,మందులు వాడటంతో పాటు ఆధునిక వైద్య చికిత్సలు అందుబాటులోకి రావటంతో తలసీమియా వల్ల మరణాలు సంఖ్య చాలా వరకు తగ్గాయి.భారత దేశ జనాభాలో 3.5 కోట్ల మంది తలసీమియా క్యారియర్స్ ఉన్నారు.కాగా ఒక అంచనా ప్రకారం భారత దేశంలో ప్రతీ సంవత్సరం 10 నుంచి 12 వేల వరకు తలసీమియా మేజర్ పిల్లలు జన్మిస్తున్నారు. హెచ్‌బి ఎలక్ట్రోపోరోసిస్ పరీక్ష ద్వారా తలసీమియా లేదా సికిల్ సెల్ వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది.తలసీమియా వ్యాధిగ్రస్థులకు ప్రతీ మూడు వారాలకు ఒకసారి రక్తం ఎక్కించాలి. తలసీమియా ఉన్న వారికి ప్రోటీన్లు,కేలరీలు అధికంగాను,ఐరన్ తక్కువగా ఉన్న ఆహారం ఇవ్వవలసి ఉంటుంది.జాగ్రత్తగా చూసుకుంటే తలసీమియా సోకిన పిల్లలు అందరి మాదిరిగానే సామాన్య జీవితాన్ని గడుపుతారు.డాక్టర్ ఎ.ఎన్.క్రిష్ణకుమారి ఆధ్వర య్యంలో మొదటి సారిగా 1998లో 20 మంది తలసీమియా రోగులతో తలసీమియా అండ్ సికిల్ సెల్ సోటీని స్థాపించటం జరిగిందని సొసైటి ఉపాధ్యక్షురాలు రత్నావలి తెలిపారు.ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా,శివరాంపల్లి రాఘవేంద్రనగర్ కాలనీలో ఉన్న తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలో 3800 మందికి బ్లడ్‌ను అందిస్తున్నామని ఆమె తెలియజేశారు.హైదరాబాద్‌తో పాటు కర్నూల్,ఖమ్మం ప్రాంతాలలో తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలు తలసీమియా రోగులు కోసం పని చేస్తున్నాయని సొసైటీ సంయుక్త కార్యదర్శి అలీంబేగ్ వెల్లడించారు.తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలు నుంచి కూడ రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీకి రోగులు వైద్య పరీక్షలతో పాటు మందులు కోసం వస్తుంటారు.ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన పేద రోగు లకు ఉచితంగా సొసైటీ తరుపున మందులు పంపిణీ చే స్తున్నామని,మే నెల 8వ తేదీన జరగనున్న ప్రపంచ తలసీమియా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అలీంబేగ్ తెలిపారు.

## సంచార జాతుల సమస్యల సాధన కోసం మూడు రోజుల పాటు జాతీయ కన్వెన్షన్

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతుల సమస్యల సాధన, రాజ్యాంగబద్ధమైన హక్కులు, అధికారాలు పొందడానికి విధానాలు తయారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశ అభిప్రాయపడింది. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు డిమాండ్లను ఆమోదించారు. సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, తిపిరిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ డిఎన్‌టి డిక్లరేషన్ రూపకల్పన చేయాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వసతి ఏర్పాటు చేసి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతీయ కన్వెన్షన్ సమావేశంలో నిర్వహించాలని, ఇందుకు దేశ వ్యాప్తంగా ఉన్న సంచార జాతి కులాల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, విద్యావంతులు, మేధావులతో కలిసి కులాల సంఖ్య, జనాభా సంఖ్య, జీవన విధాన పరిస్థితులు, సమస్యలు, సాధించుకోవాల్సిన మార్గాలు, అవసరమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధుల పై విధంగా సమస్యలను సేకరించడం జరుగుతుందని, ఫలితంగా దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల సమస్యల సాధనకు మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అన్ని సంచార జాతి కులాల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర కోఆర్డినేటర్‌లు పల్లపు సమ్మయ్య, నాగరాజు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు యువరాజ్, కార్యదర్శి నాగేశ్వరరావు, వెంకటేశ్, రవీందర్, భూపతి, జహంగీర్, పాండు, బాబు, రమేశ్, అనిత, సింహాద్రి, సత్యం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

## రైతులకు రూ. 30 వేల పరిహారం అందించాలి

-వైఎస్ఆర్‌టిపి కోఆర్డినేటర్ మల్లిఖార్జునరెడ్డి

**అక్కన్నపేట, మే 7, ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం 30వేలు అందించాలని వైఎస్ఆర్‌టిపి కోఆర్డినేటర్ అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం రోజున అక్కన్నపేట మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి అనేక పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు అకాల వర్షాలతో నష్టపోయి,మిగిలిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వ కొనుగోలు సెంటర్‌కు తీసుకువస్తే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆలస్యంగా కొనుగోల్లు ప్రారంభించడంతో ఆరబెట్టిన ధాన్యం కురిసిన వర్షాలకు నాని మొలకలు వచ్చి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల నష్టానికి కారణమైన ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు నష్టపోయిన రైతులకు 30వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ అభివృద్దే ధ్యేయం

ఆలయ చైర్మన్ బిక్షపతి




మాట్లాడుతున్న బిక్షపతి

**కొమురవెల్లి, మే 7, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి అలయ అభివృద్ధి వార్షిక అదాయం గణనీయంగా పెరిగిందని అలయ చైర్మన్ గీస బిక్షపతి తెలిపారు. అదివారం అయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి చొరవతో అలయ అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో విజయవాడ, షిరిడి మాదిరిగా 12 కోట్లతో ఈనెల 30 లోపు క్యూలైన్ల నిర్మాణ చేపడుతామన్నారు. 2020-21 వార్షిక అదాయం 8 కోట్లు పెరిగిందన్నారు. 2022-23 అదాయం 35 కోట్ల 42 లక్షలు వచ్చాయన్నారు. గుట్టపై ఉన్న ఎల్లమ్మ అలయ అదాయం సైతం పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల వరకు 62 గదులు ప్లాన్ సిద్దం చేశామన్నారు. డమరుకం, త్రిశూలం పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. స్వామి ఖాతాలో 14 కిలలో 978 గ్రాముల మిశ్రమ బంగారం, ఒక వెయ్యి తొమ్మిది 289 గ్రాముల వెండి ఉన్నదని తెలిపారు. అలయ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే యాదగిరి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అలయ ఈవో రామాంజనేయులు, అలయ డైరెక్టర్లు రఘువీరారెడ్డి, పచ్చిమట్ల సిద్దిరాములు, నమ్మిరెడ్డి సౌజన్య, సూటిపల్లి బుచ్చిరాములు, అలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ అపహరణపై దళిత సంఘాల ఆగ్రహం



దళిత సంఘాలకు సంఘీభావం ప్రకటిస్తున్న డిబిఎఫ్ నాయకులు

**మిరుదొడ్డి, మే 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ధర్మారంలో శుక్రవారం రాత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన ఆందోళనలకు దారితీస్తుంది. అంబేద్కర్ విగ్రహాన్ని అపహరించుకపోవడం పట్ల దళిత, ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. ధర్మారం గ్రామంలో గత ఏడాది గ్రామ దళితులు తమకు ఇందిరాగాంధీ హయాంలో కేటాయించిన అసైన్డ్ భూమిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించి అవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన అసైన్ట్ భూ వివాదం రోజు రోజుకు ముదురుతుంది. గ్రామంలో ఇందిరాగాంధీ హయాంలో ఇండ్ల నిర్మాణం కోసం దళితులకు కేటాయించిన అసైన్ట్ భూమిని తనకు అమ్మరని అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కుల వ్యక్తి రావడంతో లొల్లి మరింత ముదిరింది. ఈ క్రమంలోనే గ్రామంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం అపహరణకు గురైంది. అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన సంఘటనను నిరసిస్తూ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ధర్నా చేసిన 28 మంది దళితులను అరెస్టు చేసి కేసు నమోదు చేయడం పట్ల పట్ల దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అపహరించిన విగ్రహాన్ని తిరిగి అదే స్థలంలో పెట్టాలని విగ్రహాన్ని ఎత్తుకెళ్లిన దుండగులను అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మొత్తం మీద అంబేద్కర్ విగ్రహం అపహరణ సంఘటన జిల్లాలో చర్చనీయంశంగా మారింది. అంబేద్కర్ విగ్రహాన్ని ఎవరూ అపహరించారో తెలాల్సి ఉంది.

## ఎత్తుకెళ్లిన అంబేద్కర్ విగ్రహాన్ని అప్పగించండి

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

**మిరుదొడ్డి, మే 7, ప్రభాతవార్త :** ఎత్తుకెళ్లిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని వెంటనే దళితులకు అప్పగించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డి మండలంలోని ధర్మారంలో ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహాన్ని దొంగతనం చేయడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1978లో ఇందిరాగాంధీ హయాంలో సర్వే నంబరు 18లో దళితులకు ప్రభుత్వం ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చిందన్నారు. 400 గజాల స్థలంలో కమ్యూనిటీ హాల్, మిగులులో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాడు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాత్రి రాత్రికే దుండగులు అంబేద్కర్ విగ్రహాన్ని ఎత్తుకెళ్లడం సిగ్గు చేటన్నారు. అంబేద్కర్ వి గ్రహాన్ని అప్పగించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సూకురి ప్రవీణ్, అస్క స్వామి, కిరణ్, బిక్షపతి, శ్రీనివాస్, యాదగిరి, పర్శరాములు, కనకయ్య, మల్లేశం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న మిత్రుడికి ఆర్థిక సహాయం

**హుస్నాబాద్, మే 7, ప్రభాతవార్త :** తమతో విద్యా బుద్దులు నేర్చుకున్న తోటి స్నేహితుడు ఆపదలో ఉన్నారన్న విషయం తెలుసుకున్న మిత్రబృందం అతనికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందజేసింది. వివరాల్లోకి వెళ్తే 2001-02లో హుస్నాబాద్ బాలుర పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన మిత్రులు ఇటీవల నిర్వహించిన పాఠశాల 75వ వజ్రోత్స వాల్లో తిరిగి కలిసి వాట్సప్ గ్రూప్‌లో కలిసారు.ఆ గ్రూప్ ద్వారానే పట్టణంలోని ఆరెపల్లికి చెందిన తమ మిత్రుడు పోలు రాజు కాలు విరిగి శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని ఆదివారం మిత్రులు అందరూ కలసి రూ 30వేలతో పాటు 50కిలోల బియ్యాన్ని అందజేశారు.

# కనుల పండుగగా శ్రీవరదరాజస్వామి రథోత్సవం

### స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

**మర్కుక్, మే 7 (ప్రభాతవార్త):**
మర్కుక్ మండల పరిధిలోని వరదరాజ్‌పూర్ గ్రామంలోని అత్యంత ప్రసిద్ధిగాంచిన వరదరాజస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం వైశాఖ మాసం మొదలుకొని శుద్ధ సప్తమి వైశాఖ చవితి వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, వ్రతం, హోమాలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన రథంపై భూనీళా సమేత వరదరాజస్వామి వారిని అధిష్టింపజేశారు. గ్రామంలోని పురవీధులగుండా హనుమాన్ దేవాలయం వరకు రథం ఊరేగింపు నిర్వహించగా హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు స్వామివారి నామ స్మరణ చేస్తూ రథంను లాగడం జరిగింది. వరదరాజస్వామి రథోత్సవ దర్శనం వల్ల సర్వ పాపాలు పోయి కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల అపార నమ్మకం కాగా స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి మంద బాల్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్ఐ హరీష్ సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పాల ప్రవీణ్‌కుమార్, మండల కో-ఆప్షన్ సభ్యురాలు సాహెరా నరేష్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపిటిసి తుమ్మల లక్ష్మినర్సమ్మ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య, గ్రామ వార్డు సభ్యులు నగేష్, అశోక్, నర్సింలు, నాయకులు బ్రహ్మానందరెడ్డి, హనుమంతరెడ్డి, రాంరెడ్డి, కైలాసం, నర్సింలు, శ్రీశైలం, కృష్ణ, ఆలయ పూజారులు వరదాచారి, గోపాలచారి, పురుషోత్తమచారి తదితరులు పాల్గొన్నారు.



వరదరాజస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు

# నిరుద్యోగ యువత సంఘర్షణ సభను విజయవంతం చేయండి

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రమోద్

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):**
ప్రధానమంత్రి నరేంద్రమోడి, సిఎం కెసిఆర్‌లు కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రమోద్ విమర్శించారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి నివాసంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐసిసి పిలుపు మేరకు సరూర్‌నగర్‌లో నేడు జరగబోయే నిరుద్యోగ యువత సంఘర్షణ సభను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, నిరుద్యోగుల పొట్ట కొడుతున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్ళు, నిధులు, నియామకాలు చేపడతామని చెప్పి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు చేపట్టలేదన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఉపాధి కోసం ఆటోలు, టీకొట్టులు, టిఫిన్ సెంటర్‌లు నడుపుకుంటున్నారని అన్నారు. నిరుద్యోగ యువత సంఘర్షణ సభకు లక్ష లాది మంది నిరుద్యోగులు తరలిరావాలని సూచించారు. రాష్ట్రంలో 15 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే సంవత్సరానికి 2 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాయమాటలతో తొమ్మిదేళ్లయినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఈ నిరుద్యోగుల యువగర్జన సభకు ప్రియాంకగాంధీ హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గొల్లపల్లి నరేందర్‌రెడ్డి, కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడు విరూపాక్ష శ్రీనివాస్‌రెడ్డి, జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కొండపోచమ్మ మాజీ చైర్మన్ మల్లేశం, కాంగ్రెస్ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులుయాదవ్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు జహంగీర్, మైనార్టీ నాయకులు క్యాసారం బాబా, ఎస్సీ సెల్ నాయకుడు శివుడు, కొడకండ్ల మాజీ ఎంపిటిసి అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమోద్

## ఘనంగా శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం

**ఘట్‌కేసర్, మే 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటా పూర్‌లో ఆదివారం శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేకంగా వివిధరకాల పూలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. దేవస్థాన ఆవరణలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఉదారి వేణుగోపాల్, ఎంపిటిసి నిరుడి రామారావు, ఆలయ ఈఓ ఎల్.భాగ్యలక్ష్మి, వార్డుసభ్యులు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. డప్పుశబ్దాలు కళాకారుల నృత్యాలు, భక్తుల గోవిందనామస్మరణ మద్య స్వామి రథం సాగాది. సాయంత్రం స్వామికి శేషవాహన సేవ నిర్వహించారు. వెంకటాపూర్ గ్రామంలోని ప్రధాన రోడ్డు మీదుగా తేనుగూడెం వరకు వెళ్లి తిరిగి ఆలయానికి రథం చేరుకుంది. సోమవారం ఆలయంలో చక్రతీర్థం, సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేశం బాల్‌రాజ్‌గౌడ్, వార్డుసభ్యులు హరీష్, కృష్ణ, జంగయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ మహంకాళీ, నాయకులు నిరుడి శ్రీనివాస్, బుర్ర వెంకటేష్,పాల్గొన్నారు.

## గ్రామదేవతలకు మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డి పూజలు

**ఘట్‌కేసర్, మే 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో ఆదివారం గ్రామదేవతలను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మ ల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు దర్శిం చుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో బొడ్రాయి పండుగ సంద ర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకుల విజ్ఞప్తి మేరకు వారు వచ్చి చెరువుకట్టపై ఉన్న కట్ట మైసమ్మతల్లిని దర్శించుకోగా నాయకు లు శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి పండుగ

**ఘట్‌కేసర్, మే 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో ఆదివారం బొడ్రాయిపండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవతలకు భక్తి, శ్రద్దలతో పెద్ద పండుగను జరిపారు. లక్ష్మినారాయణచెరువు కట్టపై వెలిసిన కట్టమైసమ్మ తల్లికి బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి మేకలు, కోళ్లు బలిఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామదేవతల ఆలయాలను, చెరువు కట్టపై విద్యుత్‌దీ పాలతో అలంకరించారు. పలువురు ప్రజా ప్రతనిధులు, నాయకు లు, భక్తులు పెద్ద సంఖ్యలో బొడ్రాయి పండుగలో పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

**తలకొండల్లి మే7,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన నిరుపేదలైన ఏదుల జంగయ్య,కొల చంద్రుడు,ఆలూరి సత్యనారాయణ,వజ్రం వారి ఇంటి నిర్మాణాలు అసం పూర్తిగా ఉండడంతో తలకొండపల్లి మండల బిఆర్ఎస్ స్టా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి వారి ఇంటి నిర్మాణాలకు ఒక్కొక్కరికి 15 సిమెంట్ బ్యాగులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మచ్చేందర్, దేరంగుల అనంత రాములుల,ప్రశాంత్ రెడ్డి,ఇట్యాల రవీందర్, రత్న య్య, యాదయ్య,నల్ల పోతల రమేష్,సాయిబాబా,కోలా అశోక్, గాజుల ఆంజనేయులు, జోల లింగం యాదవ్,పల్లె ప్రవీణ్,కానుగుల మల్లేష్,మేస్త్రీ విజేందర్, పాల్గొన్నారు.

## కార్మికులకు వేతనాలు సమయానికి ఇవ్వకుండా.. మరో వైపు ఆంక్షలు ....!

**హుస్నాబాద్, మే 7,ప్రభాతవార్త**

అత్యవసరమైనపరిస్థితిలో ఆసుపత్రికి చేర్చాల్సిన రోగులకు సేవలందిస్తున్న 108అత్యవసర అంబులెన్స్ కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలో సేవలందిస్తున్న వందలాది మంది కారి ్మకులకు సరైన సమయంలో జీఎంఆర్ సంస్థ వేతనాలను చెల్లించకుండా ఒకవైపు ఇబ్బందులకు గురిచేస్తూనే మరోవైపు ప్రభుత్వం వైపు నుండి కార్మికులపై ఆంక్షలు విధిస్తూ వేపుకు తినడంపై 108కార్మికులు భగ్గుమంటున్నారు.ఈ విషయంపై పలువురు 108కార్మికులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ మూడు మాసాలుగా తమకు జీతాలను చెల్లించలేదని మదనపడుతూనే ప్రభుత్వం తమపై ఇలాంటి ఆరోపణలు చేయడం వెనక అర్థమేమిటో అర్థం కావడం లేదని అంటున్నారు.మా కార్మికుల్లో కొందరు కడుపుకాలి తప్పు చేసి ఉండవచ్చో ఏమో కానీ ఇందుకు అందరిని బాధ్యులుగా చిత్రీకరిస్తూ వేధించడం సబబు కాదని అంటున్నారు.తమకు సమాచారంఅందగానే తాము ఖచ్చితంగా ప్రభుత్వ వైద్యశాలకు మాత్రమే తీసుకువెళతామని కానీ ప్రయివేట్ ఆసుపత్రులకు తీసుకెళ్ళి డబ్బులు దండుకున్నట్లు అనడం సరికాదని కార్మికులు నొచ్చుకుంటున్నారు.సిద్దిపేట జిల్లాలో మొత్తం 16కు గాను 108అంబులెన్స్ వాహనాలుండగా ఇందులో దాదాపు 70మంది వరకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం ఈ విషయంలో కల్పించుకుని కార్మికులకు సరైన సమయంలో వేతనాలు అందించేలా పూనుకోవాలని వారు వేడుకుంటున్నారు. ఇదే కాకుండా హుస్నాబాద్ ప్రాంతంలోని కోహెడ మండలం,అక్కన్నపేట మండలానికి 108వాహనాలు కేటాయించకపోవడంతో హుస్నాబాద్ నుండి అక్కడకి వాహనాలు తీసుకెళుతుండటంతో సమయం వృధా అవుతున్న విషయాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించి కోహెడ,అక్కన్నపేట మండలాలకు వాహనాలను కేటాయించాలని కోరుతున్నారు.

## పేదల పాలిట కల్పవృక్షం బిజెపి : కిరణ్‌కుమార్

**కుల్కచర్ల; మే 07; ప్రభాతవార్త;** పేదలను ఆదుకునేది బిజెపి ప్రభుత్వమేనని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ భూనేటి అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో మండల పార్టీ అధ్యక్షుడు గాదె మహిపాల్ ఆధ్వర్యంలో అనారోగ్యంతో భాదపడుతున్న వ్యక్తికి ఆర్థిక సహయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన వార్వాల అంజి గత కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో భాదపడుతూ ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకుని రూ. 5000 ఆర్థిక సహాయం అందజేస్తూ అతని కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సహ యం అనేది పబ్లిసిటికి దూరంగా ఉండాలని చాలా మంది స్వప్రయోజనాలకోసం ఆరాటపడుతున్నారని నిజమైన నిరుపేదలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని రైతులకు, పేదలకు మంచిరోజులు వస్తాయని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ శుభకార్యాలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపి టిసి వార్వాల అంజిలయ్య,దళిత మోర్చా జిల్లా ప్రదాన కార్యదర్శి సంఘెం శ్రీని వాస్, కిసాన్ మోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఏదుల సంతోష్‌గౌడ్,వార్డు సభ్యు డు కాటన్‌పల్లి మహిపాల్,సోషల్ మీడియా కన్వీనర్ బైరం నరేష్‌గౌడ్,మాజి వార్డు మెంబర్ వార్వాల వెంకటయ్య,జిల్లా కార్యవర్గ సబ్యుడు దోమ రమేష్,మండల కార్యదర్శి పంతుల శివసంతోష్,గుడాల రమేష్,వార్వాల యాదయ్య ,లాలు,గుడాల సూరి,గాదె మణికంత,బండి నర్సిములు,ముదిరాజ్ సంఘం సోషల్ మోడియా కన్వీనర్లు మడిగెకాడి భగత్‌కుమార్ పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సిఎం కెసిఆర్

### బిజెపి సీనియర్ నాయకుడు ధరం గురువారెడ్డి

**గజ్వేల్, మే 7 (ప్రభాతవార్త):**
నిరుద్యోగుల పట్ల కెసిఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 30 లక్షల మంది యువతకు ఉపాధి, ఉద్యోగాలు రాలేదని బిజెపి సీనియర్ నాయకుడు ధరం గురువారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల పట్ల సిఎం కెసిఆర్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు వస్తాయని, పేదోళ్ళ బతుకులు బాగుపడతాయని ఆశపడ్డామని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని, గజ్వేల్‌లో 9వ తేదీన జరిగే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న మేధావులు, నాయకులు తరలిరావాలని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, నిరుద్యోగుల సమస్యలు తీర్చేందుకే మేధోమథనం చేసి నిరుద్యోగ మార్చ్‌కు మద్దతు ఇవ్వాలని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డ్ ఐఎఎస్ ఒరిస్సా మాజీ చీఫ్ సెక్రటరీ తేజావత్ చంద్రునాయక్, రిటైర్డ్ ఐపిఎస్ కృష్ణప్రసాద్, మాజీ టీఎస్‌పిఎస్సీ సభ్యుడు విఠల్, తొలి వెలుగు రఘులు హాజరై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నందన్‌గౌడ్, రాంమోహన్, సాయికుమార్, ఎల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, కుడిక్యాల రాములు, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధరం గురువారెడ్డి



పెద్దమ్మ తల్లి అలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

## బిఆర్ఎస్ పాలనలో ఆలయాలు అభివృద్ధి : ఎంపిపి

**బెజ్జంకి, మే 7, ప్రభాతవార్త :** బిఅర్ఎస్ సర్కారు రాష్ట్రంలోని అలయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని ఎంపిపి లింగాల నిర్మల అన్నారు. అదివారం మండల పరిధిలోని నర్సింహులపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో నూతనంగా నిర్మించబోయే పెద్దమ్మ తల్లి అలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల సంఘాల అభివృద్ధికి, సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కచ్చు రాజయ్య, ఎంపిటిసి కొలిపాక రాజు, ఉప సర్పంచ్ హరికృష్ణ, బిఅర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాకాల మహిపాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జెట్టి మొండయ్య, నాయకులు లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా,దీటి రాజు, బొనగిరి శ్రీనివాస్, దేవయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, మే 7, ప్రభాతవార్త :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మద్దికుంట నవీన్ అన్నారు. మండల పరిధిలోని వితలాపూర్‌లో ఐకెపి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కేంద్రాన్ని అయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధరను పొందాలన్నారు. రైతులు దళారులను అశ్రయించి మోసపోవద్దన్నారు. రైతు సంక్షేమానికి బిఅర్ఎస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సింగిరెడ్డి సరిత విద్యాసాగర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, అల్లీపూర్ సొసైటీ డైరెక్టర్ కొట్టాల వెంకటరెడ్డి, ఎఎంసి డైరెక్టర్ కానుగుల దేవయ్య, బాలకర్‌రెడ్డి, ఎపిఎం మైపాల్, సీసీ వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

**కొమురవెల్లి, మే 7, ప్రభాతవార్త :** దేశంలో మోడీ, రాష్ట్రంలో కెసిఅర్ ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం ఏఐకెఎస్ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. అదివారం మే డే వారోత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో అంబలి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్పోరేట్ కంపెనీలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నా ఈ ప్రభుత్వాలకు గుణ పాఠం చెప్పాలన్నారు. ఎర్ర జెండా అధ్వర్యంలో ఎన్నో కార్మిక హక్కులు సాధించుకున్నామన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఎర్రజెండా అధ్వర్యంలో కార్మిక హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, రైతె సంఘం నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి,, మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తేలు ఇస్తారి, కెవిపిఎస్ నాయకులు బక్కిలి బాలకిషన్, ఎల్లయ్య, తాడూరి మల్లేశం, అరుట్ల రవీందర్, నీల బిక్షపతి, దయానంద్, కిషన్, నరసింహులు, దాసరి మహేష్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే

**షాద్‌నగర్, మే 7, (ప్రభాతవార్త) :** ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందని, వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఈ సహాయ నిధి అం డగా నిలుస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన లింగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆదివారం కేశంపేట మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని తన నివాసంలో లిం గమ్మ కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి ద్వార మంజూరైన రూ.1లక్ష 50వేల చెక్కును అయ్యవారిపల్లి గ్రామ సర్పంచి లక్ష్మీరమేష్, తదితర గ్రామ పెద్దలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ... వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సీఎం సహాయ నిధిని ఏర్పాటు చేయడం జరిగిందని, తద్వారా ఎంతో మంది నిరుపేదలు మెరుగైన వైద్యం చేయించుకంటున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో సీఎం సహాయ నిధికి ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని ఆయన వివరించారు. వైద్యం చేయించుకోలేని ని రుపేదలు తమ దృష్టికి సమస్యలను తీసుకొస్తే వారికి సీఎం సహాయ నిధి అందేలా తమ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని విధాలుగా సహాయ సహకా రాలు అందజేస్తారని ఆయన వివరించారు. అనంతరం సీఎం సహాయ నిధి పొందిన లింగమ్మ కుటుంబ సభ్యులు సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ప్రత్యే క ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రమేష్, జి.మోహ న్‌రెడ్డి, కార్మిక నాయకుడు కృష్ణాజీ, గ్రామస్థులు మల్లేష్, రవీందర్, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింట వివాహానికి ఆర్థిక సహాయం

**షాద్‌నగర్, మే 7, (ప్రభాతవార్త) :** వీరన్నపల్లి గ్రామానికి చెందిన వడ్డే రాజమ్మ, వడ్డే జంగయ్య ల కుమార్తె జయలక్ష్మి వివాహనానికి తమ వంతు సహాయంగా ఆది వారం లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ వారి ఆధ్వర్యంలో ఒక క్వింటాలు బియ్యం బస్తాలను అందించారు. దాత మంచిరేవుల లయన్స్ క్లబ్ డిస్టిక్ చైర్మన్ సా యికృష్ణ ఆర్థిక సహాయంతో బియ్యం బస్తాలను అందజేయడం జరిగిందని లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ వారు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎన్.వెంకట్‌రెడ్డి, డిస్టిక్ ఛైర్మన్ నారాయణ, మేడిగ పెంటయ్య, బి.పాండయ్యగౌడ్, మల్చలం మురళి, మంచిరేవుల అశోక్, ఎల్కుర్తి శ్రీనివాస్, ఎం.వి.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్ ఫూ విద్యార్థులకు ఫిట్‌నెస్ టెస్ట్

**జిల్లెడు చౌదరిగూడ, మే 7,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో ఆదివారం కుంగ్ ఫూ విద్యార్థులకు ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించినట్లు మాస్టర్ రాజు తెలిపారు. ఫిర్జాపూర్, కాస్లాబాద్‌తాండ, అగిర్యాల, రావిర్యాల గ్రామాల నుంచి 49మంది విద్యార్థులు ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.మాస్టర్‌లు, రమేష్, బాల్‌రాజు, సురేష్, గ్రామస్తులు నర్సింహులు, పాల్గొన్నారు.

## గుండంలో మునిగి యువకుడి మృతి

### మృతదేహం కోసం కొనసాగుతున్న గాలింపు

**జహీరాబాద్, మే 7, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని బడంపేట గ్రామంలోని శ్రీకాచన్న స్వామి దేవస్థానం ఆవరణలోని గుండంలో ఆదివారం పుణ్యస్నానానికి వెళ్లిన యువకుడు గుండంలో మునిగి మృత్యువాత పడ్డాడు. జహీరాబాద్ ఫైర్ అధికారి పి ప్రశాంత్ కథనం ప్రకారం... కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన చందర్ రాజ్ (25) గుండంలో స్నానం ఆచరించేందుకు దిగగా ప్రమాదావశాస్తు గుండంలో పడిపోయాడన్నారు. గుండంలో యువకుడు పడి మృతి చెందినట్లు తెలుసుకుని తమ సిబ్బంది రఫీ, శ్రీనివాస్‌రెడ్డి, యూనిస్, అశోక్‌లతో సంఘటన స్థలానికి చేరుకుని యువకుడి కోసం గుండంలో గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆదివారం చీకటి పడటంతో గాలింపు పనులను ఆపేసినట్లు సోమవారం ఉదయం మరో మారు గుండంలో గాలిస్తామన్నారు.

